ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం, 11 మే 2024

ఉష్ణోగ్రత: ఖమ్మం గరిష్ఠం: 41, కనిష్ఠం: 25 ; భద్రాద్రి కొత్తగూడెం గరిష్ఠం: 41, కనిష్ఠం:28



ప్రచారానికి నేడు తెర

- చివరి రోజున హోరెత్తించనున్న పార్టీలు
- ఖమ్మం జిల్లా పరిధిలో 6 గంటల వరకు ప్రచారం
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో 4 గంటల వరకు..
- పలుచోట్ల మొదలైన నగదు పంపిణీ

ఖమ్మం, మే 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల ప్రచార యుద్ధం శనివారంతో ముగియబోతుంది. నామినేషన్ల నాటి నుంచి అభ్యర్థులు, పార్టీల నేతలు పోటాపోటీగా గెలుపు కోసం ప్రచార యుద్ధాన్ని సాగించారు. పార్టీ అధినేతలను కూడా రంగంలోకి దించారు. ఎవరికి వారు గెలుపు ధీమాతో ప్రచారంలో తగ్గేదేలే అన్నట్టుగా ప్రచార పోరు సాగిస్తూ వచ్చారు. ఖమ్మం లోక్‌సభ నియోజవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఖమ్మం జిల్లా పరిధిలోని పాలేరు, ఖమ్మం, మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రచారం నిర్వహించేందుకు గడువు ఉండగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకే ప్రచారం ముగియబోతుంది. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఉన్న భద్రాచలం, పినపాక, ఇల్లెందు నియోజకవర్గాల్లో కూడా సాయంత్రం 4 గంటలకే ప్రచారం ముగియబోతుంది. దీంతో రాజకీయపార్టీలు, అభ్యర్థులు చివరి రోజున పోటాపోటీగా ఎన్నికల ప్రచారం నిర్వహించబోతున్నాయి.

ఇప్పటికే కాంగ్రెస్ తరఫున కాంగ్రెస్ అభ్యర్థులు ఖమ్మంలో రఘురాంరెడ్డి, మహబూబాబాద్‌లో బలరాంనాయక్ విజయం కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్తగూడెంలో బహిరంగసభ నిర్వహించారు. అలాగే కాంగ్రెస్ పక్షాన ఇద్దరు అభ్యర్థుల గెలుపుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇద్దరు మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి, సినీ హీరో వెంకటేష్, రఘురాంరెడ్డి కుటుంబ సభ్యులు, మంత్రి పొంగులేటి కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొంటున్నారు. మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పక్షాన ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు, మహబాద్‌లో మాలోతు కవితల గెలుపుకోసం పార్టీ అధినేత, మాజీముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో బస్సుయాత్ర నిర్వహించారు. బీఆర్ఎస్ తరఫున రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ , మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, కందాల ఉపేందర్‌రెడ్డి, బానోతు హరిప్రియ, బానోతు మదన్‌లాల్ ప్రచారం సాగించారు.

ఇక బీజేపీ అభ్యర్థులు ఖమ్మంలో తాండ్ర వినోద్‌రావు, మహబూబాబాద్‌లో సీతారాంనాయక్‌లు గెలుపు కోసం ఆ పార్టీ కూడా పలు చోట్ల సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించింది. ప్రధాన పార్టీలకు దీటుగా ప్రచారం నిర్వహిస్తున్నది. వినోద్‌రావు గెలుపు కోసం కేంద్రమంత్రి రాజ్‌నాద్ సింగ్, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బస్తర్ మహారాజు, కాకతీయ వారసుడు కమల్ చంద్ర భంజ్‌దేవ్, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తదితరలు ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన మద్దతు ప్రకటించడంతో ఎన్డీయే కూటమిగా మూడుపార్టీలు ర్యాలీలు,ప్రచారాలు సాగిస్తున్నాయి. గతంకంటే బీజేపీ ఈసారి ప్రధాన పార్టీలకు పోటీగా ప్రచారం సాగిస్తోంది. బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో పాటు పార్టీ అనుబంధ నాయకులు, టీడీపీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ వాసిరెడ్డి రామనాథం, కేతినేని హరీష్ ప్రచారంలో పాల్గొన్నారు.

చివరి రోజైన శనివారం నాడు మూడు ప్రధాన పార్టీలు ప్రచార పోరును పోటాపోటీగా సాగించబోతున్నాయి బైక్ ర్యాలీలు, రోడ్‌షోలు, సమావేశాలతో చివరి ఘట్టాన్ని హోరెత్తించబోతున్నాయి. ప్రచార రధాలతో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేయబోతున్నారు. మొత్తం మీద ఎన్నికల ప్రచార ఘట్టం శనివారం సాయంత్రం ముగుస్తున్నందున పార్టీలు ఓట్లకు నోట్ల పంపిణీపై దృష్టి సారించాయి. ఇప్పటికే ఓటుకు రూ.500 పంపిణీ చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. బహిరంగ ప్రచారం పూర్తి కావస్తున్నందున, ఇక ఓటర్లకు మందు, మాంసం నగదు పంపిణీలు సాగించబోతున్నారు.

సిటీ పోలీస్‌యాక్టు అమలు
పోలీసు కమిషనర్ సునీల్‌దత్ 9

మందు బాబులకు నో చీర్స్
48 గంటలు మద్యం షాపులు బంద్ 9

పకడ్బందీగా సైలెన్స్ పీరియడ్
కలెక్టర్ వీపీ గౌతమ్ 9



మధిరలో మాట్లాడుతున్న రఘురాం రెడ్డి

గెలుపు కాదు ముఖ్యం.. మెజారిటీనే

- ఆరు గ్యారెంటీల్లో ఐదు అమలు
- బీజేపీ, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మురిగినట్లే
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి
- మధిరలో బీజేపీ ఎన్నికల ప్రచారం

9



ఓటర్లకు నమస్కరిస్తున్న నామా నాగేశ్వరరావు, పక్కన ఎంపీ రవిచంద్ర, సండ్ర

దగా చేసిన కాంగ్రెస్ ఓడించాలి

- హామీల్లో ఏది అమలు జరగలేదు
- ఓట్ల కోసం వచ్చే నాయకులను నిలదీయాలి
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- కల్లూరులో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార ర్యాలీ

9



సంఘీభావం ప్రదర్శిస్తున్న మంద కృష్ణమాదిగ, తాండ్ర వినోద్‌రావు, నాయకులు

మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్, బీఆర్ఎస్

- మాదిగలకు మేలు చేసింది చంద్రబాబు తర్వాత మోదీనే
- ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి వినోద్‌రావును గెలిపించాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ
- ఖమ్మంలో బీజేపీ నాయకులతో ఎమ్మార్పీఎస్ సమావేశం

9

ఓటు వేయడం మన బాధ్యత

- రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్
- నగరంలో ఉత్సాహంగా బైక్ ర్యాలీ

ఖమ్మ కలెక్టరేట్, మే 10: 'ఓటు హక్కు మన బాధ్యత... ప్రతి ఒక్కరూ ఈ ఎన్నికల్లో ఓటేద్దాం....' అని ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, ఖమ్మం లోకసభ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్ జి కోల్టే అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, వ్యయ పరిశీలకులు అరుణ్ ప్రసాత్ కృష్ణసామి, శంకర నంద్ మిశ్రా లతో కలిసి స్వీప్ కార్యాచరణలో భాగంగా ఓటరు చైతన్యంలో భాగంగా ఐడీఓసీలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు.

బైక్ ర్యాలీలో రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్‌తో పాటు, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, జిల్లా స్వీప్ నోడల్ అధికారి, జిల్లా ఉపాధికల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్, జిల్లా అధికారులు, సిబ్బంది పాలొన్నారు. కలెక్టరేట్ నుంచి శ్రీ శ్రీ సర్కిల్, జడ్పీ సర్కిల్ మీదుగా ప్రధాన రహదారి వెంట కొనసాగింది. అనంతరం పెవిలియన్ గ్రౌండ్ వద్ద ముగిసింది. దారిపొడవునా ప్రజాస్వామ్యం, ఓటు ప్రాముఖ్యత తెలుపుతూ సాగిన ర్యాలీలో జిల్లా పరిషత్ సెంటర్ వద్ద యువత దేశభక్తి గేయాలకు చేసిన నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ర్యాలీ ముగింపు సందర్భంగా పెవిలియన్ గ్రౌండ్ వద్ద రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీగౌతమ్ మాట్లాడుతూ ఈ నెల 13న పోలింగ్‌లో ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు వేయకుంటే మనం ప్రశ్నించే హక్కును కోల్పోతామని తెలిపారు. జిల్లాలో పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, అధికారులు, సిబ్బంది, యువత పాల్గొన్నారు.



'ఓటుహక్కు వినియోగించుకోండి' అంటూ.. బైక్ ర్యాలీని నిర్వహిస్తున్న ఆర్‌వో, కలెక్టర్ వీపీ గౌతమ్ తదితరులు



నోటుకు ఓటు

- పోలింగ్‌కు ముందే ప్రలోభాల జాతర
- ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పంపిణీ
- గుట్టుచప్పుడు కాకుండా నోట్ల పండుగ

వైరా, మే 10: పోలింగ్ సమీపిస్తుండటంతో ప్రలోభాల జోరు మొదలైంది. ఖమ్మం ఎంపీ నియోజకవర్గ పరిధిలో 16,31,039మంది ఓటర్లు ఉన్నారు. ఒక ప్రధాన పార్టీ అభ్యర్థి దాదాపు 85శాతం మంది ఓటర్లకు నగదు పంపిణీ చేయటానికి నిర్ణయం తీసుకొని ఇప్పటికే తమ శ్రేణుల ద్వారా రెండురోజుల నుంచి జోరుగా పంపిణీ మొదలుపెట్టారు. ఒక్కో ఓటుకు రూ.500చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఇదే అభ్యర్థి ఒక్కో పోలింగ్ బూత్‌కు రూ.15వేల చొప్పున ప్రచారం, ఇతరత్రా ఖర్చుల నిమిత్తం వారం ముందే గ్రామాల్లోని తమ పార్టీ, మిత్రపక్షాల నాయకులకు చేరవేశారు. ఎన్నికల గుర్తుతోపాటు పచ్చనోటు కూడా ఓటర్లకు పంపిణీ చేస్తున్నారు. ఇకపోతే మరో ప్రధాన పార్టీ అభ్యర్థి కూడా ఓట్లకు నోట్లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ అభ్యర్థి కూడా ఒక్కో పోలింగ్ బూత్‌లో ఎన్నికల ప్రచారం, ఇతరత్రా ఖర్చుల నిమిత్తం రూ.15వేల చొప్పున ఇప్పటికే పార్టీ శ్రేణులకు అందజేశారు. దాదాపు 60శాతం మంది ఓటర్లకు నగదు పంపిణీ చేయటానికి నిర్ణయం తీసుకున్నారని, మిగిలిన రెండు రోజుల్లో పంపిణీ ప్రక్రియను పూర్తిచేసేందుకు సర్వం సిద్ధంచేసుకున్నారని సమాచారం. ఈ అభ్యర్థి కూడా ఒక్కో ఓటుకు రూ.500చొప్పున పంపిణీ చేసి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నట్లు చర్చ జరుగుతుంది.

ఇకపోతే మరో ప్రధాన పార్టీ అభ్యర్థి పోలింగ్ బూత్‌ల ఖర్చులతోపాటు ఓటర్లకు ఎంతమేర నోట్లు పంపిణీ చేయాలనే దానిపై ఇంకా ఒక నిర్ణయానికి రాలేదని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అభ్యర్థి కూడా పోలింగ్‌బూత్‌ల ఖర్చులతోపాటు కొంతమంది ఓటర్లకైనా నోట్లు పంపిణీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఒక్క అభ్యర్థికి మాత్రమే నోట్లు పంపిణీ చేసేందుకు పార్టీ శ్రేణులు ఉండగా, మిగిలిన ఇద్దరు ప్రధాన అభ్యర్థులకు ఆశించిన స్థాయిలో పార్టీ శ్రేణులు లేనందున నోట్లు ఎంతమేరకు ఓటర్లకు చేరతాయనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఏటీఎం నుంచి రూ.76లక్షలు మాయం
- క్యాష్ డిపాజిట్ ఇన్‌చార్జిపై కేసు నమోదు 10



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని

'తాండ్ర'కే టీడీపీ సంపూర్ణ మద్దతు

- టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీశ్

ఖమ్మం మామిళ్లగూడెం, మే 10: జాతీయ పార్టీ అధ్యక్షుడి ఆదేశాల ప్రకారం, రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని, దీనికి విరుద్ధంగా కొందరు తమ సొంత అజెండాను అమలుచేస్తున్నారని దీనిని తిప్పికొట్టాలని టీడీపీ పార్లమెంట్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీశ్ అన్నారు. టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం మేరకు తెలంగాణ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి టీడీపీ మద్దతు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. ఈ మేరకే ఖమ్మంలో పోటీలో ఉన్న బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని కేతినేని హరీశ్ తెలిపారు. కాంగ్రెస్ నాయకులు గానీ, బీఆర్ఎస్ నాయకులు గానీ టీడీపీ మద్దతు కోరే హక్కులేదని, ఏ హక్కుతో తమ జెండాలు పెట్టుకొని తిరుగుతున్నారని హరీశ్ ప్రశ్నించారు. ఆంధ్రాలో చంద్రబాబు 50 రోజులు జైల్లో ఉన్నప్పుడు ఆ అక్రమ అరెస్టును ఏరోజైనా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఖండించారా అని ప్రశ్నించారు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు టీడీపీ మద్దతు అవసరం ఉంటుందని తర్వాత మోహం చాటేయడం రివాజుగా మారిందన్నారు. కేసీఆర్, కేటీఆర్ చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండించక పోగా, మీడియా ముందు మళ్లీ జగనే గెలవబోతున్నాడని మాట్లాడారని అన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు కుల సంఘాలను రెచ్చగొడుతూ మద్దతుగా పలకాలని కోరుతున్నారని, ఇది సరైంది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వైస్సార్‌సీపీకి వేసినట్లేనని, నామాకు వేస్తే కేసీఆర్‌కు వేసినట్లే నని ఈ విషయాన్ని టీడీపీ కార్యకర్తలు ఆలోచించాలని కోరారు. ఈ ఎన్నికల్లో ముమ్మాటికీ ప్రతి టీడీపీ కార్యకర్త ఎన్డీఏ కూటమి అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు విజయానికే కృషిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట ఇన్‌చార్జ్ కట్రం స్వామి దొర, నార్లపాటి శ్రీనివాస్, మందపల్లి కోటేశ్వరరావు, పృథ్వీ, బోయిన వెంకన్న, నాగండ్ల లక్ష్మన్, భైరు అప్పారావు, రామానుజం, శివ, ప్రవీణ్ పాల్గొన్నారు.

‘సింగరేణి’ని కాపాడుకుందాం..

» కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి
» కొత్తగూడెం కార్మికుల ఏరియాలో ప్రచారం
» మైనార్టీలు, మున్నూరుకాపు సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు



పని ప్రదేశాల్లో ఓటర్లను అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రఘురాంరెడ్డి

రుద్రంపూర్, (సింగరేణి) మే 10: సింగరేణి సంస్థను కాపాడుకోవడం ద్వారా వేలాదిమంది కార్మికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఖమ్మం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. తెలంగాణలోని అతిపెద్ద ప్రభుత్వరంగసంస్థ అయిన సింగరేణిలో నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే 5 ఇంక్లైన్, జీఎం కార్యాలయంతోపాటు పలు డిపార్టుమెంట్ల వద్ద ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ద్వారా కార్మిక ప్రాంతాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని తెలిపారు. సింగరేణి కార్మికులంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేయడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్మికులు పనులు చేసే ప్రదేశాల్లో సందర్శించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఐఎన్‌టీయూసీ ఏరియా, కార్పోరేట్ ఉపాధ్యక్షుడు ఎండి. రజాక్, పితాంబరం, నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), డాక్టర్ శంకర్‌నాయక్, సోమిరెడ్డి, ప్రభాకర్, తిరుపతిరావు, జేబీ. మోహన్, స్వప్నారెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీల ఆత్మీయసమావేశంలో రఘురాంరెడ్డి

కాంగ్రెస్ పార్టీ ద్వారానే అన్నివర్గాలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు సాధ్యపడతాయని ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ముస్లీం ఐక్యవేదిక ఆత్మీయసమ్మేళనాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన గెలుపు కోసం అన్నివర్గాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ మతతత్వ బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, మైనార్టీ నాయకులు నయింఖురేషీ, హుస్సేన్, జేబీ. అబ్దుల్‌రబ్, అలీఖాన్, ఎస్‌కే. అబ్దుల్‌బాసీద్, అమీద్, ఇస్మాయిల్, సయ్యద్ సమీ, మౌలానా, అబ్దుల్ ఖరీం, జరీనాబేగం పాల్గొన్నారు.

మున్నూరుకాపుసంఘం సమస్యలను పరిష్కరిస్తా

లక్ష్మీదేవిపల్లి: తాను గెలిచాక మున్నూరుకాపుసంఘం సమస్యలను పరిష్కరిస్తానని ఖమ్మం పార్లమెంటరీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఆ సంఘం బాధ్యులకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలోని మున్నూరుకాపు సంఘం నాయకులతో ఆయన ప్రత్యేక భేటీ అయ్యారు. మున్నూరుకాపు సంఘం తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ ఎన్నికల్లో తనకు సహకరించి గెలిపిస్తే మున్నూరుకాపు సమస్యలను తప్పకుండ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మున్నూరుకాపు సంఘం బాధ్యులు మహాలక్ష్మి సత్యనారాయణ, కాసా హనుమంతరావు, లింగాల గోపాల కృష్ణ, ప్రసాద్, ఆళ్ల మురళీ, సైండ్ల రాజు, కిష్టయ్య, రామస్వామి, కృష్ణ, నకుల్, సుంకు సత్యనారాయణ, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు » మణుగూరులో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌తో కలిసి ప్రచారం





మణుగూరులో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, కార్యకర్తల భారీ ర్యాలీ

మణుగూరు, మే 10: ఏ మాత్రం ఆదమరిచి ఉన్నా.. భవిష్యత్‌లో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారం వచ్చింది కదా అని నిర్లక్ష్యం తగదు.. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఎంతో ముఖ్యం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చేతిగుర్తుపై ఓటు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి బలాన్ని ఇవ్వండి రేపటి మహోన్నత అభివృద్ధికి సహకరించండి అంటూ తెలంగాణా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రజలను కోరారు. శుక్రవారం మణుగూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ తరుపున నిర్వహించిన భారీ మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొని తర్వాత అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ తో పాటు కొంత మంది వ్యక్తులు రేపో మాపో ప్రభుత్వం పోతుందని లేని పోని బీరాలు తీస్తున్నారు. గుంట కాడి నక్కలా కాచుకుకూర్చున్నారు. వారి కట్రలను తిప్పి కొట్టాలన్నారు. సీఎంకు అండగా నిలవాలంటే జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ మాట్లాడుతూ.. తన కాలంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. తనకు ఓటు వేస్తే రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు వేసే ఓటు అన్నారు. కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. సీపీఎం జిల్లా నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, టీడీపీ నేత చలపతిరావు మాట్లాడారు.

ఆకట్టుకున్న మోటర్ సైకిల్ ర్యాలీ

మంత్రి తుమ్మల, ఎంపీ అభ్యర్థి బలరామ్ నాయక్, శుక్రవారం సాయంత్రం మణుగూరు చేరుకున్న సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ , మిత్ర పక్షాల యూనియన్ల నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కాటిబోయిన నాగేశ్వరరావు, కృష్ణం రాజు, వెలగపల్లి జాన్, వహెద్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలు సుఖంగా ఉన్నారు

● మాజీ మంత్రి పువ్వాడ



మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ

ఖమ్మంకార్పొరేషన్, మే 10: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజలు సుఖంగా ఉన్నారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కోరుతూ శుక్రవారం రాత్రి ఖమ్మం నగరంలోని త్రీటౌన్. వన్‌టౌన్ పరిధిలోని డివిజన్లలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 5నెలలు గడిచినా నేటి వరకు హామీలను అమలుచేయలేదన్నారు. నీళ్లన్నా తాగునీరు సరఫరా చేయలేని అసమర్థతతో కాంగ్రెస్ ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు తాగునీటిపై ప్రత్యేకప్రణాళికి రూపొందించి ఎక్కడా నీటిఎద్దడి తలెత్తకుండా చూశామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలయ్యే హామీలు ఇచ్చిందని, ప్రజలు ఎప్పుడు ఇబ్బంది పడలేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అమలు చేయలకపోతుందని పువ్వాడ ప్రశ్నించారు. ప్రజలపై ప్రేమ ఉంటే ఇలాగే పరిపాలిస్తారా అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించి వారు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు పోరాడాలంటే బీఆర్ఎస్ అభ్యర్థి నామాన గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీచైర్మన్లు గుండాల కృష్ణ, లక్ష్మీప్రసన్న, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, పసుమర్తి రాంమోహన్, షేక్ మగ్బుల్, దాదే అమృతమ్మ, తోట ఉమారాణి, కన్నం వైష్ణవి, పల్లా రోజ్‌లీనా, నాయకులు నాగేశ్వరరావు, రామారావు, తోట వీరభద్రం, రుద్రగాని ఉపేందర్, సంతోష్, తదితరులుపాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ప్రజాసమస్యలు వినిపిస్తా

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా



తల్లాడలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

తల్లాడ/ఏన్కూరు, మే 10: ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజాసమస్యలపై లోక్‌సభలో గొంతు కనైనినదిస్తానని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తల్లాడ మండలం మిట్ట పల్లి, నూతనకల్ గ్రామాల్లో జరిగిన ముఖ్యకార్యకర్తల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం ఎంపీగా రెండుసార్లు ప్రాతినిధ్యం వహించి పార్లమెంట్ వేదికగా తెలంగాణ, ఉమ్మ డి ఖమ్మంజిల్లా సమస్యల పరిష్కారం కోసం కృషిచేశా నన్నారు. రైతు సమస్యలపై పార్లమెం ట్‌ను స్తంభింపజే శానని పేర్కొ న్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను అమలుచే యకుండా మోసం చేసిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధిచెప్పాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు మూడురో జులే కీలకమని నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి బీఆర్ఎస్ విజయానికి కృషిచేయాలన్నా రు. సమావే శంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరా వు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమో హన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, నాయకులు నాయుడు శ్రీనివాసరా వు, కేతినేని చలపతిరావు, మువ్వా మురళీధర్ రావు, కొండపల్లి చంద్రశేఖర్, తూము శ్రీనివాసరావు, శెట్టిపల్లి లక్ష్మణ్‌రావు, చల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి కి కృషిచేస్తా: నామా

ఏన్కూరు: తనను మరోసారి గెలిపిస్తే జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఏన్కూరులో రోడ్‌షో నిర్వహించారు. నామా మాట్లాడుతూ ఖమ్మం జిల్లా రైతుబిడ్డను, ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగానని ప్రాణం ఉన్నంత వరు ప్రజల మధ్యనే ఉంటానని తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజాసేవ చేస్తునాన్నరు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను వలన అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, జడ్పీటీసీ బాదావత్ బుజ్జి, ఎంపీటీసీ వసిరెడ్డి వెంకటేశ్వర్లు, నాయకులు వేముల రమేష్‌బాబు, పొన్నం హరికృష్ణ, మాదినేని అశోక్, భూక్యా బాలాజీ, పూర్ణకంటి నాగరాజు, నజీర్, గడ్డం వెంకటేశ్వర్లు, చీటి కోటేశ్వరరావు, వెంకన్న పాల్గొన్నారు.

కవిత వాహనం తనిఖీ

టేకులపల్లి/మధిరరూరల్, మే 10: పార్లమెంటు ఎన్నికల నేథ్యంలో మండలంలోని బొమ్మనపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం మహబూబాబాద్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోతు కవిత వాహనాన్ని చెక్‌పోస్టు సిబ్బంది క్షుణంగా తనిఖీ చేశారు. టేకులపల్లి వైపు నుంచి కొత్తగూడెం వైపు వెళ్లుతున్న కవిత వాహనాన్ని చెక్‌పోస్టు వద్ద నిలుపుదల చేసి తనిఖీలు నిర్వహించారు. అలాగే మధిరలో నామా నాగేశ్వరరావు తనయుడు పృథ్వీతేజ వాహనాన్ని కూడ తనిఖీ చేశారు.

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, మే 10: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేసిన ఆ పార్టీని తుంగలో తొక్కాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిదిలోని వరంగల్‌క్రాస్ రోడ్డులో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తు సీపీఎం, సీపీఐ నాయకులతో కలిసి శుక్రవారం రాత్రి వరంగల్‌క్రాస్ రోడ్డులో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతు గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌కి ప్రజలు తగిన బుద్ది చెప్పారని గుర్తు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఎక్కువ మెజార్టీ అందించాలనికోరారు. ఇచ్చిన హామీలన్నీ తప్పకుండా అమలు చేస్తుందని తెలియచేశారు. కార్యక్రమంమలో ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, కాంగ్రెస్ నాయకులు బండి జగదీష్, మద్ది వీరారెడ్డి, వెంకటరెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం మోదీకే ప్రజల మద్దతు

» ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు » ఖమ్మం, నేలకొండపల్లిలో ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న తాండ్ర వినోద్‌రావు

ఖమ్మం బైపాస్‌రోడ్/నేలకొండపల్లి/సత్తుపల్లి మే 10: దేశ రక్షణ కోసం ప్రజలు మోదీకి మద్దతు తెలుపుతున్నారని, బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. నగరంలోని 24వ డివిజన్‌లో బీజేపీ సీనియర్ నాయకులు రుద్రప్రదీప్ ఆధ్వర్యంలో వినోదరావు గెలుపుకోసం ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. వినోద్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ ఎన్నో అబద్దాలు చెప్పి, హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. అరచే తిలో వైకుంఠంచూపి అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కరెంట్ కోతలు, సాగు, తాగునీరు ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటు న్నారని, 5 నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింద న్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీజేపీ 400 సీట్లు గెలిచి మూడోసారి అధికారంలోకి రాబోతుందని, దానిలో ఖమ్మం కూడా ఉండబోతుందన్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, మోతకూరి నారాయణరావు, వెంకటేశ్వర్లు, దేవకి వాసుదేవరావు, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, విద్యాసాగర్, కార్పొరేటర్ దొంగల సత్యనారాయ ణ, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, సరస్వతి, శ్యామ్ పాల్గొన్నారు.

బీసీలకు పెద్దపీట వేసింది బీజేపీ మాత్రమే

దేశంలో బీసీలకు న్యాయం చేసింది బీజేపీ మాత్రమేనని ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఖమ్మం నగరంలోని బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో జిల్లా ఓబీసీ మోర్చా ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల నుంచి అభివృద్ధి లేదని అందుకే బీజేపీ ఖమ్మంపై దృష్టి పెట్టిందన్నారు. అందుకే పార్టీ అగ్రనేతలు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, కాకతీయవంశ 22 వ వారసుడు మహారాజా కమలచంద్ర భంజ్ దేవ్ కాకతీయ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఇక్కడ ప్రచారానికి వచ్చారని తెలిపారు. కాశ్మీర్ ఇతర సమస్యలన్ని ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ సాగుతున్నారని చెప్పారు.

400 సీట్లతో ప్రధానమంత్రి మోదీ ప్రభుత్వం ఏర్పడుతుంది అందులో ఖమ్మం కూడా ఉండాలన్నారు. సమావేశంలోన్‌ఓబీసీ ప్రెసిడెంట్ వీరు గౌడ్, రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు, మాధవ్, అంజయ్య, డాక్టర్ పాపారావు, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అత్యంత ప్రమాదకరం

నేలకొండపల్లి, మే 10: కాంగ్రెస్‌కు వేసే ప్రతి ఓటు అత్యంత ప్రమాదకరమని, బీఆర్ఎస్‌కు వేసే ఓటు మురిగిపోయినట్లేనని ఖమ్మం పార్లమెంటు బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. శుక్రవారం నేలకొండపల్లిలో తెలుగుదేశం-బీజేపీల ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుంచి పీఎస్సార్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీఎస్సార్ సెంటర్లో పార్టీ మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావుయాదవ్ అధ్యక్షతన జరిగిన ర్యాలీలో అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే మోదీ మూడోసారీ ప్రధాని కావాలన్నారు. పాలేరు ఇన్‌ఛార్జి కనగాల వెంకట్రామయ్య, వాసుదేవరావు, భవనాశి దుర్గారావు, మండల అధ్యక్షుడు మన్నె కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు షేక్.షర్ఫుద్దీన్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, దళిత సంఘం రాష్ట్ర నాయకుడు సూరేపల్లి జ్ఞానరత్నం పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా ఖమ్మంను అభివృద్ధి చేస్తా

సత్తుపల్లి: మనకోసం, మన పిల్లల కోసం రాజకీయాలకు అతీతంగా తనను గెలిపించినట్లయితే జిల్లాను అభివృద్ధి చేస్తానని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు అన్నారు. శుక్రవారం రాత్రి సత్తుపల్లి పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని రింగ్‌సెంటర్ వద్ద ప్రసంగించారు. కార్యక్రమంలో నంబూరి రామలింగేశ్వరరావు, నాయుడు రాఘవరావు, భాస్కర్ల వీరంరాజు, పాలకొల్లు శ్రీనివాస్, ఆచంట నాగస్వామి, పోట్రు వెంకట రామారావుల తో పాటు ఎమ్మార్పీఎస్, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ప్రకటనలు ఇవ్వొద్దు: కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్, మే 10: భారత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) అనుమతి లేకుండా పోలింగ్ రోజున, పోలింగ్‌కు ఒక రోజు ముందు ఈ నెల 12, 13వ తేదీలలో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదని ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా సరే ముందస్తుగా ఎంసీఎంసీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ధృవీకరణ పొందాలని రిటర్నింగ్ అధికారి ఆ ప్రకటనలో తెలిపారు.

కాంగ్రెస్ చేప్పేవన్నీ మాయ మాటలే..

● మణుగూరు కార్నర్ మీటింగ్‌లో మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కవిత



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కవిత

మణుగూరు, మే 10: కాంగ్రెస్ మాయ మాట లు విని ఓ సారి మోసపోయారు.. ఓట్లు వేశారు. నాటి సీఎం కేసీఆర్ అమలు పరిచిన సంక్షే మ పథకాలు ఇప్పు డు అమలౌతు న్నాయా.. లేదే.. కాంగ్రెస్ చేప్పేవ న్నీ మాయ మాటలే ఆరు గ్యారెంటీల్లో గ్యారెంటీ లేదు.. ఇప్పటికైనా తెలుసుకోండి. ప్రశ్నించే గొంతుక నాది శిరసు వంచి అభ్యర్థిస్తున్న జరగబోయే ఎన్నికల్లో నన్ను గెలిపించండి అంటూ మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత ప్రజలను వేడుకున్నారు. శుక్రవారం మణుగూరులో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. సింగరేణిలో కారుణ్య నియామకాలు.. కార్మికులు సంక్షేమానికి పెద్ద పీట వేయడం, ప్రతి నియోజకవర్గ కేంద్రంతో పాటు అనేక మండలాల్లో వైద్య సేవలు అందించి, సాగు నీరు తాగునీటికి లోటు లేకుండా చేసిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌దే అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసే మోసాలను నివారించేందుకు ప్రశ్నించే గొంతుక కావాలన్నారు. ఆ గొంతుకనై మీకు అండగా నిలుస్తా నన్ను గెలిపించండి అంటూ అభ్యర్థి కవిత ప్రజలను కోరారు. తొలుత పినపాక మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు మాట్లాడుతూ.. కొన్ని రోజుల్లోనే సీఎం రేవంత్ రెడ్డి జైలుకు పోవడం ఖాయమన్నారు. సీఎం పదవికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అర్హుడని పేర్కొనడమే రేపటి రోజున ఈ ప్రభుత్వం ఉంటుందన్న గ్యారెంటీపై అనుమానం పడక తప్పదన్నారు. దేవుళ్లపై కూడా ఓట్లు వేసి ప్రజలను మోసం చేస్తూ మాయ మాటలు చెప్పడం సీఎం రేవంత్‌కే సాధ్యమైందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని కోరారు ఈ సమావేశంలో నాయకులు కోలేటి భవానీ శంకర్, పోశం నర్సింహారావు, బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, ఏనిక ప్రసాద్, రమా పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసం బీజేపీని గెలిపించాలి

● ఎన్నికల ప్రచారంలో మహబూబాబాద్ బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్



ఓటర్లకు అభివాదం చేస్తున్న సీతారాంనాయక్

మణుగూరు, మే 10: దేశ సమగ్రతను కాపాడాలంటే జరగబోయే ఎన్నికల్లో ప్రజలంతా ఆలోచించి బీజేపీకి ఓటు వేయాలని మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. శుక్రవారం మణుగూరు పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శనతో అభ్యర్థి సీతారాంనాయక్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ ఇంట్లోలేరు బయట లేరు... కవితకు ఓటు వేస్తే జరిగేది ఏమిటి..? ఒరిగేది ఏమిటి.. అని ప్రశ్నించారు. ఓ ప్రాంతీయ పార్టీలో ఉండే ఎన్నో అభివృద్ధి పనులు చేసిన వాడిన ఈ రోజు ప్రధాని మోదీ వద్దకు తనకు ఓటు ద్వారా స్థానం కల్పిస్తే దక్షణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలాన్ని ఎంత అభివృద్ధి చేస్తానో చేసి చూపిస్తా అన్నారు. తన పేరే సీతారామ్ నాయక్ రమ చంద్ర స్వామి ఆలయాన్ని రెండో అయోధ్యగా గా తీర్చి దిద్దుతానని తనను నమ్మాలని వాగ్దానం చేశారు. ఆరు నెలల్లో సారపాకకు రైలు రాకపోతే తన ముఖం చూడకండి అని ప్రజలకు మనవి చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రిజర్వేషన్ల పై చేసిన వ్యాఖ్యలను సూమోటో గా స్వీకరించి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీతారామ్ నాయక్ అన్నారు. బీజేపీ అభ్యర్థికి టీడీపీ, ఎంఆర్‌పీఎస్ మద్దతు ప్రకటించాయి. దేశం నాయకులు మేదర మెట్ల శ్రీనివాసరావు, తాతా మాధవి, పసుపూరి కృష్ణ. సీత, మేదరమెట్ల నాగేశ్వరరావు, ధర్మరాజు శంకర్, చందామధు, మడకం శాంతమణి, పురిటి విజయలక్ష్మి,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా ఎంఆర్‌పిఎస్ డివిజన్ మండల నాయకులు హాజరయ్యారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎంపి తో పాటు పూల మాలలు వేశారు. బీజేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన పట్టణ వాసులను ఆకట్టుకునేలా పార్టీ శ్రేణులు నిర్వహించారు.

ప్రచారానికి దూరంగా ఎంపీ పార్థసారథిరెడ్డి

» నామా నామినేషన్ దాఖలకు మాత్రమే హాజరు
» గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లిలో ఆయనదే హడావుడి

సత్తుపల్లి, మే 10: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సారధిగా అన్నీ తానే అయి వ్యవహరించిన రాజ్యసభ సభ్యుడు, హెటిరోడ్రగ్స్ అధినేత బండి పార్థసారధి రెడ్డి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. పస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరావు ప్రచారం లో ఇప్పటి వరకు పాలుపంచుకోలేదు. దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆయన చ్రారంలో కనిపిం చకపోవడంతో చర్చనీయాంశంగా మారింది. తాను నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తనదేనంటూ ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి మరీ హామీలు ఇచ్చారు. సత్తుపల్లి అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటవీరయ్య విజయం కోసం గతంలో ఎన్నడూ ప్రజలతో సంబంధాలు లేకపోయినా ప్రతి గ్రామం తిరిగి ప్రచారం చేశారు. ఎన్నికల ఫలితాల ప్రతికూలంగా రావటంతో ఫలితాల అనంతరం ఇంత వరకూ ఆయన నియోజకవర్గ ప్రజలను కలుసుకోలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తుపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలుపించుకొని వచ్చే బాధ్యతను కేసీఆర్ అప్పగించారు. రాజ్యసభ సభ్యుడుగా నియోజకవర్గ ప్రజలకు కోట్లనిధులు ఖర్చు య్యే పనులకు పెద్దసంఖ్యలో హామీలు కూడా ఇచ్చారు. అవసరమైతే తాన స్వంత నిధులు అభివృద్ధికి ఖర్చు చేస్తానని కూడా ప్రకటించారు. పార్టీ ఫిరాయించిన వారికి కూడా ఆయనే సహకారం అందంచారన్న ప్రచారం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో పాటు, ఆయన స్వగ్రామంలో కూడా కాంగ్రెస్ ఆధిక్యత సాధించింది. సత్తుపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. దీంతో ఎన్నికల ఫలితాల తరువాత పార్థసారధిరెడ్డి ఇప్పుడు ఎన్నికల ప్రచారానికి, సత్తుపల్లిబీఆర్ఎస్ రాజకీయాలకు దూరం గా ఉంటన్నారు. లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల సందర్భంలో ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు నామినేషన్ల దాఖలులో మా త్రం హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొంటారని భావించినా ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో ఇప్పటి వరకు పాల్గొనలేదు. తాను నిర్వహించే వ్యాపారాలకు మారిన రాజకీయ పరిస్థితులు ఆటంకం కలిగించే అవకాశం ఉన్నందున ప్రచారంలో పాల్గొనడం లేదని తెలిసింది.

అందరు సీఎంలతో సన్నిహితం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్.రాజశేఖరరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, తెలంగాణా ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌కు ఆయన సన్నితంగా ఉండేవారు. రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి అధికారంలో ఉన్నా ఆయన వారితో సత్సంబంధాలు కలిగిన పార్థసారధిరెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో కేసీఆర్ ఆయనకు గౌరవప్రదమైన ఉన్నత పదవి కల్పించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ కూడా ఆయనకు నామినేటెడ్ పదవిలో నియమించారు.

పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి


» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ » ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఖమ్మం కలెక్టరేట్, మే 10: లోక్‌సభ సాధారణ ఎన్నికల పోలింగ్ పకడ్బందిగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆయన ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో కలిసి లోక్‌సభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు శుక్రవారం ముగిసిందని పార్లమెం టు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్‌లను ఎక్చెంజ్ చేసుకొని, మే 12 నాటికి ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నుంచి జారీ చేసిన పోస్టల్ బ్యాలెట్, నమోదైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాల రిపోర్ట్ అందజేయా లన్నారు. ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు నుంచి సైలెన్స్ పీరియడ్ ప్రారంభమవుతుందని, సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు సమాచారం అందించాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని, డబ్బు, మద్యం పంపిణీ కాకుండా చూడాలని వాటిపై సీ విజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. పోలింగ్ సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలలో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందజేసి వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు మే 12 సాయంత్రం నాటికి చేరుకోవాలని సూచించారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెం ట్ పరిధిలో మహిళా, దివ్యాంగుల, మోడల్, యూత్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మే 13న ఉదయం మాక్ పోల్ నిర్వహిం చాలని, మాక్ పోల్ అనంతరం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలని, ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతం వివరాల నివేదికను సమర్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల వెబ్ క్యాస్టింగ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. సెక్టార్ అధికారులు రిజర్వ్ ఈవీఎం యంత్రాలతో సన్నద్ధంగా ఉండాలన్నారు. పోలింగ్ సమయంలో ఈవీఎం యంత్రాలు మరమ్మతుకు గురైతే వెంటనే రీప్లేస్ చేయాలని అన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచి సీల్ చేయాలన్నారు. ఎన్నికలకు సంబం ధించిన నివేదికలను సకాలంలో సమర్థవంతంగా సమర్పించాలని, రిపోర్టింగ్ సమయంలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వవద్దన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్‌డిఓ సన్యాసయ్య, జడ్పి సీఈవో వినోద్, కలెక్టరేట్ ఏవో అరుణ, పర్యవేక్షకులు మీనన్, సత్యనారాయణ, రాంబాబు, అధికారులు పాల్గొన్నారు.

గెలుపు కాదు ముఖ్యం..మెజారిటీనే

» కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి

మధిరటౌన్,మే10: ఖమ్మం పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఎప్పుడో ఖాయం అయ్యిందని గెలుపు ముఖ్యం కాదు మెజారిటీనే ముఖ్యం అని ఆ పార్టీ అభ్యర్థి రామసాహయం రఘురామిరెడ్డి అన్నారు. శుక్రవారం మధిర లో పలువురిని కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న తన గుర్తు హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే ఐదింటిని అమలు చేసిందని అన్నారు. బీజేపీకి వేసిన, బీఆర్ఎస్‌కు వేసిన ఓటు మురిగిపోయినట్లేనని కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీనే అని రాహుల్ గాంధీ ప్రధానిని చేసేందుకు మీ ఓటు ఉపయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాల రమణ గుప్త, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగా హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షులు దుంపా వెంకటేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు కోనా ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, నిడమానూరు వంశీ, పారుపల్లి విజయ్, దారా బాలరాజు, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, రామరాజు, నరసింహారావు, రవి, కాశీ, జహంగీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘురాంరెడ్డి

చిన్నారుల కుటుంబాలను ఆదుకుంటాం

» మంత్రి పొంగులేటి పరామర్శ

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 10: ప్రమాదవశాత్తూ మున్నేరు హైవే గుంతలో పడి మృతి చెందిన పిల్లల కుటుంబాలను శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఖమ్మం నగరంలోని రామచంద్రయ్య నగర్‌లో ముగ్గురు బాధిత చిన్నారుల కుటుంబాల ఇంటికి పొంగులేటి వెళ్లారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. పిల్లల భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతి చెందిన పిల్లల తల్లిదండ్రులను, బంధువులను పొంగులేటి ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తొందని హామీ ఇచ్చారు.



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి

మోసపూరిత హామీలతో

దగా చేసిన కాంగ్రెస్‌ను ఓడించాలి

» బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

కల్లూరు, మే 10 మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ప్రజలకు పిలుపు నిచ్చారు. శుక్రవారం కల్లూరులో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక ఐదు నెలల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏది అమలు జరగలేదని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో రెండోసారి మోస పోకుండా కారు గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వదించాలన్నారు.

ప్రజలకు సేవలు చేయని వారికి ఓట్లు ఎలా వేస్తారు...వద్దిరాజు

జిల్లా ప్రజలకు ఏనాడు సేవలందించని బడా నాయకులు ఈ ఎన్నికల్లో ఇతర పార్టీల నుంచి పోటి చేస్తున్నారని వారికి ఎలా ఓట్లు వేద్దామని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవీచంద్ర ప్రశ్నించారు. ఖమ్మం వాసిగా నామా నాగేశ్వరరావు ఈ జిల్లాకు నామా ముత్తయ్య ట్రస్టు ద్వారా, ఎంపీగా ఎంతోగాను సేవలు, అభివృద్ధి చేశారన్నారు. సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రసంగిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కల్లూరు ప్రాంతంలో చేపట్టిన అనేక అభివద్ధి పనులు నిలిచి పోయయాన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాలెపు రామానాగేశ్వరావు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, బోబోలు లక్ష్మణరావు, పెడకంటి రామకృష్ణ, మేకల కృష్ణ, కమ్మి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన


కాంగ్రెస్, బీఆర్ఎస్

» మాదిగలకు మేలు చేసింది చంద్రబాబు తర్వాత మోదీనే
» దేశ రక్షణకు, అభివృద్ధికి మళ్లీ మోదీ ప్రధాని కావాలి
» ఖమ్మంలో బీజేపీ అభ్యర్థి వినోద్‌రావును గెలిపించాలి
» ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ

ఖమ్మం బైపాస్‌రోడ్, మే 10: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మాదిగలను మోసం చేశాయని, ఎస్సీ వర్గీకరణను కాంగ్రెస్ అడ్డుకుని కుట్ర చేసిందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కృష్ణ మాదిగ ఆంధ్రాలో ఎన్డీయే కూటమి తరపున పలుచోట్ల ప్రచారంలో పాల్గొని హెలీకాప్టర్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ తాను ఎన్నో కష్టాలు, బాధలు పడుతూ మాదిగ బిడ్డల కోసం, వారి భవిష్యత్ కోసం ఉద్యమం చేశానని, ఎన్నో అవకాశాలు, పదవులను వదలుకుని మాదిగ బిడ్డల కోసం పనిచేస్తూ వారికే అవకాశాలు కల్పిస్తున్నాన్నారు. తన మిత్రుడు, బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపుకోసం మాదిగలు కృషిచేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను మోసం చేసిందన్నారు. కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కావ్య మాదిగ వర్గానికి చెందిన వారు కాదని రేవంత్‌రెడ్డే పలు మీటింగ్‌ల్లో చెప్పారని, అలాంటిది ఆయన బిడ్డకు వరంగల్ టికెట్ ఎలా కేటాయించారని ప్రశ్నించారు.

ఒకపక్క మోదీ రిజర్వేషన్లు తీసుకొస్తుంటే రిజర్వేషన్లు తొలగిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దళితులను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందన్నారు. 1998లో తనకు చంద్రబాబు పెద్దపల్లి ఎంపీగా అవకాశం కల్పిస్తూ ప్రకటించారని, అయితే తన జాతి బిడ్డలకు ఏబీసీడీ వర్గీకరణ కావాలని ఎంపీ పదవి వద్దని చెప్పానన్నారు. దీంతో చంద్రబాబు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చి మాదిగలకు అవకాశం కల్పించారన్నారు. ఆదేవిధంగా పదేళ్లపాలనలో కేసీఆర్ ఎంత మోసం చేశాడో ప్రజలు గుర్తించారన్నారు. ఇప్పుడు కేసీఆర్ పనై పోయి ఖాళీగా ఉన్నాడని ఎద్దేవా చేశారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు మాట్లాడుతూ బీజేపీ మళ్లీ అధికారంలోకి రాబోతుందని, తనకున్న పరిచయాలతో జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. దేశంలో పోరాటాలకు స్ఫూర్తి మంద కృష్ణమాదిగ అని, అలాంటి వ్యక్తి తన గెలుపుకు ఖమ్మం రావడం సంతోషకరమన్నారు. గ్యారంటీ అంటే మోదీనని, మాట ఇస్తే తప్పకుండా నెరవేరుస్తారన్నారు. కులాలకు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు పనిచేసి తన గెలుపుకు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సునిల్ మాదిగ, క్రాంతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, టీడీపీ ఖమ్మం పార్లమెంట్ కార్యదర్శి కేతినేని హరీష్, అశ్వారావుపేట టీడీపీ ఇన్‌చార్జి టి.స్వామి తదితరులు పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో రైతు మృతి

కల్లూరు, మే 10: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కల్లూరు మండలం ఎర్రబోయనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రబోయనపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు పోట్రు వెంకటేశ్వరరావు, అలియాస్ శ్రీను (52) తన ఇంటి వెనుక గల పెరటిలో పెంచుతున్న పశుగ్రాసానికి(జాడ) నీళ్ల పెట్టేందుకు మోటారు ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఆస్ట్రేలియా, కుమార్తె అమెరికాలో ఉండడంతో వారు వచ్చేందుకు మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉండడంతో మృతదేహాన్ని ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో భద్రపరిచారు. కాగా వెంకటేశ్వరరావు మృతికి పలువురు మండల టీడీపీ నాయకులు కాకర్ల రంగారావు, జాస్తి శ్రీనువాసరావు, మాజీ ఎంపీటీసీ పోట్రు శ్రీనువాసరావు, బాణోతు చిట్టిబాబులు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు.



వెంకటేశ్వర రావు(ఫైల్)

బిక్యాతండాలో మూడు ఎడ్లు

పాల్వంచ, మే 10: విద్యుదాఘాతంతో మూడు ఎడ్లు మృతి చెందిన సంఘటన మండలంలోని బిక్కుతండా గ్రామంలో శుక్రవారం జరిగింది. గురువారం మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడటంతో బిక్కుతండా గ్రామశివారులోని పొలాల్లో ఉన్న విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. కాగా శుక్రవారం ఉదయం మేత కోసం అటుగా వెళ్లిన భూక్యా స్వాములు, వీరన్నలకు చెందిన మూడు ఎద్దులు కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి.



మృతి చెందిన ఎడ్లు

పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై పెట్రోల్ దాడి

ముదిగొండ, మే 10: పాతకక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింహారావు అనే వ్యక్తి ఉప్పలమ్మ పండుగ చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో శుభకార్యానికి వచ్చిన వరుసకు తమ్ముడైన సైదులుపై నర్సింహారావు పాతకక్షలను మనస్సులో పెట్టుకొని పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అప్రమత్తమైన బంధువులు వెంటనే మంటలను ఆర్పివేశారు. తీవ్రంగా గాయపడిన సైదులును చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. పెట్రోల్ దాడికి పాల్పడిన నర్సింహారావును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

» ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

అశ్వారావుపేట రూరల్, మే 10: కుటుంబ కలహాలతో ఓవ్యక్తి పెట్రోల్ పోసుకుని ఆత్మాహత్యాయత్నానికి పాల్పడగా, మంటల్లో ఉన్న వ్యక్తిపై బురద పోసి కానిస్టేబుల్ ప్రాణాలు కాపాడాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేట పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో రాష్ట్ర సరిహద్దులో ప్లాస్టిక్ పూల వ్యాపారం చేసుకునే రాహుల్ అనే వ్యక్తి కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే అక్కడే సరిహద్దు చెక్‌పోస్టు విధులు నిర్వహిసున్న అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ మనోజ్ వెంటనే సంఘటన స్థలం వరకు పరుగులు తీసి, రాహుల్ ఒంటిపై ఇసుక, బురదను పోశాడు. దీంతో మంటలు అదుపులోకి వచ్చి ప్రాణాపాయం తప్పింది. క్షతగాత్రుడిని స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం గుంటూరుకు తరలించారు. కాగా మంటల్లో అతడి శరీర భాగాలు చాలా వరకు కాలిపోయాయి. ఎంతో చాకచక్యంగా వ్యవహరించి రాహుల్ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ మనోజ్‌ను పలువురు అభినందించారు.

పకడ్బందీగా సైలెన్స్ పీరియడ్

» కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మే 10: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పోలింగ్ సమయానికి 48 గంటల ముందు నుంచి పోలింగ్ ముగిసేంతవరకు సైలెన్స్ పీరియడ్ గా పాటించాలని ఖమ్మం పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైలెన్స్ పిరియడ్ లో ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయడానికి వీలు లేదని, ఫలితాల వివరాలను వెల్లడించడం, పత్రికల్లో ప్రచురించడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయడం, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకొని వెళ్లడం నిషేధించినట్లు తెలిపారు. 48 గంటల పాటు సైలెన్స్ పిరియడ్ లో ఎటువంటి ఎన్నికల ప్రచారం నిర్వహించడానికి వీలులేదన్నారు. ఎన్నికలకు సంబంధించి వీడియోలు, పాటలు ప్రదర్శించవద్దన్నారు. రాజకీయ నాయకులు పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి అనుచరులు ఎక్కడ ఎటువంటి రాజకీయ ప్రసంగాలు చేయవద్దని, ప్రచారానికి ఇతర ప్రాంతాలను వచ్చిన వారుతిరిగి వెళ్లిపోవాలన్నారు. 48 గంటల పాటు సైలెన్స్ పీరియడ్ లో స్థానికులు మాత్రమే ఉండాలని, స్థానికేతరులు లాడ్జిలను ఖాళీ చేసి వెళ్లిపోవాలని తెలిపారు. రాజకీయ ప్రచారానికి సంబంధించిన బల్క్ మెసేజీలు పంపడం నిషేధించామని పేర్కొన్నారు. సైలెన్స్ పీరియడ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

ఈఏపీసెట్ పరీక్షకు 4,260 మంది హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి మే 10: ఈఏపీసెట్ ఇంజనీరింగ్ పరీక్ష శుక్రవారం ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా నిర్వహించారు. ఖమ్మంలో ఉదయం సెషన్‌లో 1,564 మందికి 1,520 మంది మధ్యాహ్నం 1,565 మందికి 1,534 మంది, సత్తుపల్లిలో ఉదయం 394 మందికి 385 మంది, మధ్యాహ్నం 400 మందికి 385 మంది, భద్రాద్రిలో ఉదయం 220 మందికి 219 మంది, మధ్యాహ్నం 220 మందికి 217 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారులు తెలిపారు.

ఉరేసుకొని యువతి ఆత్మహత్య

మధిరటౌన్, మే10: ఉరి వేసుకుని ఓ యువతి ఆత్యహత్యకు పాల్పడిన సంఘటన మధిరలో చోటు చేసుకుంది. మధిర సుందరయ్యనగర్‌లోని అన్నపూర్ణ మెస్ రోడ్డులోని ఓ అపార్టమెంట్‌లోకి విజయవాడకు చెందిన ఓ యువతి, యువకుడు అద్దెకు దిగారు. శుక్రవారం అఖిల(22) ఉరివేసుకున్న విషయాన్ని అపార్టమెంట్ వాసులు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. టౌన్ ఎస్ఐ సంధ్య సంఘటన జరిగిన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువతి, యువకుడికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

గుండెపుడిలో బీటెక్ విద్యార్థిని..

జూలూరుపాడు: ఉరేసుకొని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుండెపుడి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన భోగిన్ని బిందు (21) సుజాతనగర్ మండలం వేపలగడ్డలోని అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాలలో బిందు బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నది. ఈనెల 6 నుంచి కళాశాలకు వేసవి సెలవులు ఇవ్వడంతో ఇంటి వద్దనే ఉంటుంది. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి వచ్చి చూసేసరికి ఆమె మృతి చెంది ఉంది. విద్యార్థిని మృతికి గల కారణాలు తెలియరాలేదు.

సిటీ పోలీస్‌యాక్టు అమలు

» పోలింగ్ నేపథ్యంలో పలు ఆంక్షలు » పోలీసు కమిషనర్ సునిల్‌దత్

ఖమ్మం క్రైం, మే 10: ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ స్వేచ్ఛాయుత వాతావరణంలో సజావుగా జరిగేలా ఖమ్మం పోలీస్‌కమిషనరేట్ పరిధిలో నిషేదాజ్ఞలు అమల్లో ఉంటాయని పోలీసుకమిషనర్ సునిల్‌దత్ శుక్రవారం తెలిపారు. ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు బహిరంగసభలు, ఊరేగింపులు, మైక్‌ల ద్వారా అన్నిరకాల ప్రచారాలు నిషేధించబడతాయన్నారు. ఎన్నికలలో సంఘ వ్యతిరేక శక్తుల జోక్యాన్ని అరికట్టడానికి హైదరాబాద్ సిటీ పోలీసుయాక్ట్ కింద శనివారం నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ఆజ్ఞలు అమల్లో ఉంటాయన్నారు

- ఐదుగురుకంటే ఎక్కువమంది వ్యక్తులు గుమికూడడం, ఊరేగింపులు వంటివి చేయడం నిషేధం
- పోలింగ్ కేంద్రాలకు కిలోమీటరు దూరం వరకు ఆత్మరక్షణ పేరుతో కర్రలు, తుపాకులు, మారణాయాధాలతో సంచరించడం నిషేధం
- బహిరంగ ప్రదేశాల్లో షామియనాలు, పందిళ్ల వంటి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడానికి అనుమతిలేదు
- కమిషనరేట్ పరిధిలో ఆంక్షల సమయంలో మైకులు, స్పీకర్ల ద్వారా పాటలుపెట్టడం, ప్రజలనుద్దేశించి ప్రసంగాలు చేయడం నిషిద్ధం
- వ్యక్తులు, వర్గాలమధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్లకార్డులు, చిత్రాలు, గుర్తులు ప్రదర్శించడం చట్టబద్ధమైన అధికారానికి భంగం కలిగించే లేదా ధిక్కరించే నేరానికి దారితీసే అవకాశం ఉన్న ఏదైనా ప్రసంగం నిషేధం

144వ సెక్షన్ అమలు

పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు 200మీటర్ల పరిధిలో 144వ సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ సునిల్‌దత్ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలింగ్ కేంద్రం పరిధిలో ఐదుగురు అంతకుమించి గుమికూడవద్దన్నారు. సోమవారం ఉదయం 6గంటలనుంచి రాత్రి 8గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలుంటాయని సీపీ హెచ్చరించారు.

48 గంటలు మద్యం షాపులు బంద్

» నేటి సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6గంటల వరకు..

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 10: లోక్‌సభ ఎన్నికల్లో ఎటువంటి అల్లర్లు, ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 48గంటల పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. ఇరు జిల్లాల ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో ఎక్సైజ్ సూపరింటెండెంట్‌లు, స్టేషన్ ఆఫీసర్లు మద్యం నియంత్రణ చర్యలను ప్రారంభించారు. అనాధికారికంగా మద్యం నిల్వలను ఏర్పాటుచేసిన స్థావరాలను గుర్తించే స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 11వ తేది సాయంత్రం 6గంటల నుంచి 13 సాయంత్రం 6గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేస్తారు. ఖమ్మం జిల్లాలో 122 వైన్స్, 36 బార్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 89 వైన్స్, 12బార్లు 48గంటల పాటు మూతపడనున్నాయి.

నేడు లక్ష్మీనరసింహస్వామికి చందనోత్సవం

భద్రాచలం, మే 10: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంద ఆలయమైన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం స్వామి వారికి చందనోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం స్వామి వారికి చందనోత్సవ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రలు కావాలని దేవస్థానం అధికారులు కోరారు. భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారు శుక్రవారాన్ని పురస్కరించుకొని స్వర్ణభద్రకవాచలతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.




మాజీ దళకమాండర్‌కు జైలు శిక్ష

ఇల్లెందుటౌన్, మే 10: సీపీఐ (ఎంఎల్) సీపీబాట మాజీ దళకమాండర్ బోగి భద్రయ్యకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ ఇల్లెందు సివిల్ కోర్టు జడ్జి కీర్తి చంద్రికరెడ్డి తీర్పు వెల్లడించారు. 2018న అప్పటి కొమరారం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కొమరారం సెంటరులో వాహనాలను తనిఖీ చేస్తుండగా భద్రయ్య ఆటోలో వెళ్తూ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకుని తనిఖీ చేశారు. అతని వద్ద రివాల్వర్‌తోపాటు ఇతర వస్తువులు దొరకగా, కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం శుక్రవారం నేరం రుజువుకావడంతో అతడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు.

దూషించిన కేసులో ముగ్గురికి 6నెలల జైలు

ఖమ్మం లీగల్, మే 10: దూషించి గాయపరిచిన ముగ్గురికి జైలు శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ శుక్రవారం తీర్పుచెప్పారు. నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఓ మహిళ ఇంటికి తన సొంత బంధువులైన ముదిగొండ మండలం గంధసిరి గ్రామానికి చెందిన పస్తం ఉప్పలరాజు అతని భార్యకు గొడవలు జరిగి కోర్టులో కేసు ఉండటంతో ఖమ్మం కోర్టుకి స్వగ్రామం నుంచి వచ్చారు. కోర్టుపని అనంతరం కోవిడ్ కారణంగా వారు గ్రామానికి వెళ్లకుండా ఫిర్యాది ఇంటిలోనే ఉన్నాడు. ఈ క్రమంలో నగరంలోని పాకబండ బజార్‌కు చెందిన పస్తమ్ బాయమ్మ, కొండపల్లి చిన్న కోటయ్య అలియాస్ వీరస్వామి కోటయ్యరాజు, కొండపల్లి భూదేవిలు చెడు ప్రచారం చేయడంతో పాటు చంపుతానని బెదిరించారని ఫిర్యాదుదారు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అట్టి కేసును విచారించిన న్యాయాధికారి నేరం రుజువుకావడంతో ముగ్గురికి ఆరు నెలల జైలు, రూ.వెయ్యి జరిమానా శిక్షవిధిస్తూ తీర్పు చెప్పారు. అదనపు ప్రాసిక్యూటర్ నర్సింగ్ అనిల్‌కుమార్, కోర్టు కానిస్టేబుల్ రామకృష్ణ సహకరించారు.



పెద్దమ్మ తల్లికి ఘనంగా పంచామృతాభిషేకం



పాల్వంచ, మే 10: పాల్వంచ మండలం కేశవాపురం-జగన్నాధపురం గ్రామాల మధ్య వేంచేసియున్న కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో శుక్రవారం అమ్మవారికి ఘనంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో దేవస్థానం అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం అనంతరం హారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఈవో సుదర్శన్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

పోలీస్ ఫ్లాగ్‌మార్చ్‌లో ఎస్పీ రోహిత్ రాజు



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరు నిర్భయంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డు నుంచి కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు వరకు నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో ఎస్పీ పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాట్లను చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాల చర్యలు చేపడుతున్నామ న్నారు. ప్రజల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపేందుకే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్‌లను నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల ద్వారా ఎవరైన ఓటర్లను ప్రలోభపెడుతున్నట్లు తమ దృష్టికి వస్తే ఎన్నికల నియమావళి ప్రకారం వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఏఎస్పీ విక్రాంత్‌సింగ్, కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాజు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యుడు రాందాస్ నాయక్

అశ్వారావుపేట రూరల్, మే 10: మండలంలోని వినాయకపురం, గుమ్మడివల్లి పీహెచ్‌సీ పరిధిలోని మలేరియా పీడిత గ్రామాలు, గొత్తికోయ గ్రామాలు రాళ్లవాగు, ఉడుములబండ, పెద్దమిద్దె, కొండరెడ్ల గ్రామమైన గోగులపుడి గ్రామాల్లో శుక్రవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో గొత్తికోయలకు మలేరియా నిర్ధారణ పరీక్షలు జరిపి ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అనంతరం ఉడుములబండలో ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

ఇల్లెందుటౌన్, మే 10: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రియాంక అల ప్రకటించారు. శుక్రవారం ఇల్లెందు పట్టణంలోని జేకే కాలనీ సింగరేణి హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. ఈవీఎంల పని విధానంతోపాటు పలు అంశాలను స్థానిక ఎన్నికల అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 13న జిల్లాలో పోలింగ్ నిర్వహణ ఉంటుందని తెలిపారు. ప్రజలు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఓటింగ్‌లో విస్తృతంగా పాల్గొనాలని సూచించారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్‌స్టేషన్ల వద్ద తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ బూతుల వద్ద ఓటర్లకు మంచినీటి సౌకర్యంతోపాటు, టెంట్లను ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. పటిష్టమైన బందోబస్తు ఉంటుందని, ఇప్పటికే పోలీస్ అధికారులు తగిన చర్యలు చేపట్టారని వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్‌కేంద్రాల వద్ద వెబ్ కెమెరాలను ఇప్పటికే ఏర్పాటు చేశారని వెల్లడించారు. అన్ని రాజకీయ పార్టీలు ఓటింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులకు సహకరించాలని సూచించారు. పోలింగ్ జరిగే రోజు ప్రత్యేక అధికారుల పర్యటనలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజలంతా నిర్భయంగా ఓటింగ్‌లో పాల్గొనేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికలు ఆద్యంతం పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కాశయ్య, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కోట రవికుమార్‌లతోపాటు ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక కాలనీల్లో ఏఐటీయూసీ ప్రచారం

బలరాం నాయక్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



ప్రచారం చేస్తున్న మిత్రపక్షాల నాయకులు

మణుగూరుటౌన్, మే 10: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ నెల 13న జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా కాలనీ వీధుల్లో మోదీ హటావో.. దేశ్‌కి బచావో అంటూ యూనియన్ నాయకులు నినదించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచి కార్యదర్శి వై రాంగోపాల్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి ఆదర్ల సురేందర్‌లు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలను అమలు చేయకుండా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ ఎన్నికల్లో కార్మిక వ్యతిరేఖ విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరంచేస్తుందని, కార్మికులు పోరాడి తెచ్చుకున్న కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. సింగరేణిలోని గనులను ప్రైవేటు పరం చేసేందుకు టెండర్లను పిలిచిందని, సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని అన్నారు. సింగరేణి పరిరక్షణకు కాంగ్రెస్‌కు ఓటే వేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో సీపీఐ, ఏఐటీయుసీ నాయకులు రాంనర్సయ్య, పుల్లారావు, సుభాని, ఆడెపు రాజశేఖర్, శరత్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఎన్నికల ప్రచారం సమాప్తం

ఓటర్లకు డబ్బు పంపిణీకి శ్రీకారం.. చివరి ఘట్టంలో పార్టీల బిజీ..

కొత్తగూడెం, మే 10 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇప్పటి వరకు ఎన్నికల ప్రచారవెడెక్కిపోయింది. శనివారం సాయంత్రం 5గంటలకు ప్రచారం ముగియనుంది. దీంతో అభ్యర్థులు పార్టీల నేతలు, నాయకులు పతాక స్థాయికి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రచార పర్వం ముగియనుండటంతో ఓటర్లకు డబ్బుల పంపిణీ శ్రీకారం చుట్టారు ఏజెన్సీ నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఒక గంటపాటు పోలింగ్ కుదింపు ఉదయం 7గంటల నుంచి ప్రారంభం 4 గంటలకు పోలింగ్ ముగుస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం కావడం నక్సల్స్ ప్రభావిత ప్రాంతం జిల్లాగా గుర్తింపు పొందడంతో ఒక గంటపాటు పోలింగ్‌ను కుదించారు. పోలింగ్ ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు జిల్లాకు సంబంధించిన ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. 11వ తేదీ నుంచి 13వ తేదీ సాయంత్రం వరకు మద్యం దుకాణాలను మూసివేయనున్నారు.

చికెన్ వండ లేదని తల్లిదండ్రులపై దాడి

చుంచుపల్లి, మే 10: చికెన్ వండ లేదని తల్లిదండ్రులపై కుమారుడు రాడ్, కర్రతో విచక్షణ రహితంగా దాడి చేసిన సంఘటన చుంచుపల్లి మండలంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రంపూర్ పంచాయతీ పరిధిలోని తిలక్‌నగర్ ప్రాంతంలో లోథ్ శ్యామ్‌లాల్ - రాంబాబు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రమేష్ లారీ క్లీనర్‌గా పని చేస్తూ మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో తరచూ తల్లిదండ్రులతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంట్లో చికెన్ కూర వండ లేదని తల్లిపై విచక్షణ రహితంగా దాడి చేశాడు. అడ్డుకోబోయిన తండ్రిని సైతం రాడ్‌తో, కర్రలతో తీవ్రంగా గాయపరిచాడు. క్షతగాత్రుల అరుపులు, కేకలతో స్థానికులు సంఘటన స్థలానికి వెళ్ళి దాడి చేస్తున్న కుమారుడు రమేష్‌ను అడ్డుకున్నారు. 100 డయల్ చేసి పోలీసులకు సమాచారాన్ని అందించారు. క్షత గాత్రులను 108 వాహనంలో సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గాయపరిచిన రమేష్‌ను కొత్తగూడెం టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తీవ్రంగా గాయపడిన తల్లి రాంబాయిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు.

ఏటీయం నుంచి రూ.76లక్షలు మాయం

క్యాష్ డిపాజిట్ ఇన్‌చార్జిపై కేసు నమోదు

పాల్వంచ, మే 10 : ఏటీయం నుంచి నగదు మాయమైన ఘటనలో క్యాష్ డిపాజిట్ ఇన్‌చార్జిపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కధనం ప్రకారం కొత్తగూడెంకు చెందిన మునుగూరి రాజశేఖర్ సీఎంఎస్ ఇన్‌ఫో సిస్టంలో క్యాష్ డిపాజిట్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. బుధవారం తనకు అప్పగించిన విధుల్లో భాగంగా కొత్తగూడెం విద్యానగర్ కాలనీ, పాల్వంచ దమ్మపేట సెంటర్ ఏటీయంలలో నగదు డిపాజిట్ చేశాడు. కానీ శుక్రవారం డిపాజిట్ చేసిన క్యాష్ లెక్కల్లో రూ.76 లక్షలు మాయమైనట్లుగా ఆ సంస్థ గుర్తించింది. ఏటీయంలోని పాస్వర్డ్‌లు మొత్తం రాజశేఖర్‌కు మాత్రమే తెలుసునని, ఆతనే నగదు మాయమవడానికి కారణమని తాము భావిస్తున్నామని సీఎంఎస్ సంస్థ వరంగల్ మేనేజర్ జితేందర్ ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

జూలూరుపాడు, మే 10: మండలంలోని రామకృష్ణపురం గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన పలు కుటుంబాల వారు ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం జూలూరుపాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు, సొసైటీ చైర్మన్ లేళ్ళ వెంకటరెడ్డి వారం దరికి కండువాలను కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, నాయకులు ధారావత్ రాంబాబు, బాలాజీ, శాంతీరామ్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

భద్రాచలం, మే 10: మహబూబాద్ లోక్‌సభ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోరుతూ శుక్రవారం భద్రాచలంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుడగం శ్రీనివాస్, బోగాల శ్రీనివాసరెడ్డి, సరెళ్ల నరేష్ పాల్గొన్నారు.

అన్ని సౌకర్యాలు తీర్చిదిద్దాలి: పీవో

పినపాక, మే 10: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాలల వేసవి సెలవులు ముగిసి, పునః ప్రారంభమయ్యే నాటికి అన్ని సౌకర్యాలు తీర్చిదిద్దాలని, ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా స్పెషలాఫీసర్లు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ ఆదేశించారు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన ఎల్చిరెడ్డిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎల్చిరెడ్డిపల్లి పాఠశాల అపరిశుభ్రంగా ఉండడంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులు, వసతి గదులను ప్రతిరోజు శుభ్రం చేయాలని, గదుల కిటికీలకు మెస్ ఏర్పాటు, డార్మెటరీ గదులకు ఆల్ఫాబెట్‌లో నంబర్లు కేటాయించాలని, విద్యార్థులు పడుకునే గదుల్లో ప్రతి నాలుగు బెడ్లకు ఓ ఫ్యాన్ ఉండేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. టాయిలెట్లు, ధోబీఘాట్ల వద్ద విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్లాట్‌ఫామ్‌లు చేయించాలన్నారు. డ్రైనేజీల్లో మురికి నీరు నిల్వ లేకుండా చూడాలని, మళ్లీ ఆకస్మిక పర్యటన చేస్తానని, చేసేనాటికి ఏర్పాట్లు పూర్తి కాకపోతే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే పేదల జీవితాల్లో మార్పులు: కోరం

ఇల్లెందుటౌన్, మే 10: కాంగ్రెస్‌తోనే పేదల జీవితాల్లో పెనుమార్పులు సంభవిస్తాయని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో పట్టణ, మండలాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, సీపీఐ నాయకులు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇల్లెందు పట్టణంలోని స్టేషన్‌బస్తీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు కొండపల్లి కోటయ్య, నెంబర్2బస్తీ సీపీఐకి చెందిన శంషుద్దీన్, మండల పరిధిలోని రొంపేడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అజ్మీరా మంజాలతోపాటు సుమారు 70కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ద్వారాలో ప్రజల మౌళిక సమస్యలు పరిష్కరించబడతాయని వెల్లడించారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు అదోగతి పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల పేరిట బీఆర్ఎస్ చోటా, మోటా నాయకుల వద్ద నుంచి అగ్రనాయకుల వరకు అక్రమార్జన చేశారని తీవ్రంగా విమర్శించారు. చేరిన వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు దొడ్డా డానియల్, మండల అధ్యక్షుడు సైదులు, సీనియర్ నాయకులు శ్రీనివాస్, సాంబమూర్తి, బోళ్ల సూర్యం, జానీ, కౌన్సిలర్ కొప్పు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బందికి వాలంటీర్ల సమకూర్పు

సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్‌జైన్



మణుగూరు, మే 10: పోలింగ్ సిబ్బందికి సహాయకులుగా ప్రత్యేక వాలంటీర్లను సమకూర్చడం జరిగిందని ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం మణుగూరులో తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వాలంటీర్ల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన టీషర్టులను ఆవిష్కరించారు. 250 పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వహించే సిబ్బందికి, ఓటర్లుకు ఈవీఎం మిషన్లు అందజేత వంటి పలు సేవల్లో వాలంటీర్లు సహకారం అందించనున్నట్లు తెలిపారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

ఆశ్రమ పాఠశాలలో వసతుల పరిశీలన



పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న పీవో

కరకగూడెం, మే 10: పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని తాటిగూడెం ఎంపీపీ పాఠశాల 29 పోలింగ్ కేంద్రం, పద్మాపురంలోని 30వ పోలింగ్ కేంద్రాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మండలంలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఆయన తరగతి గదులను శుభ్రం చేయకుండా ఉండటంతో సంబంధిత హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజు పాఠశాలలను శుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలకు వేసవి సెలవులు ఉన్నందున తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పాఠశాలకు సంబంధించిన ప్యాచ్ వర్కులు, మైనర్ రిపేర్లు, ప్రతి తరగతి గదిలో మంచిగా ఉండాలన్నారు. డైనింగ్ హాలులో, డార్మెటరీలలో, గాలి వెలుతురు సక్రమంగా వచ్చేలా ఏర్పాట్లు చేయాలన్నారు. హాస్టల్‌లలో వెంటి లెటర్స్‌కి క్రిమి కీటకాలు రాకుండా మెస్ వేయించాలన్నారు. ఈ నెల 20వ తేది నాటికి అన్ని పనులు పూర్తి కావాలని అధికారులను ఆదేశీలించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఉద్యానవన అధికారి అశోక్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ కరుణాకర్, ఎస్ఐ రాజేందర్, తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం జగన్ పాల్గొన్నారు.

బలరాం నాయక్‌ను గెలిపించాలి

ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం



నమూనా ఈవీఎంలతో ప్రచారం

మణుగూరుటౌన్, మే 10 : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయుసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియాలో పీవీ కాలనీ, బాంబే కాలనీ, సీ-టైపు కాలనీల్లో మిత్రపక్ష యూనియన్‌లను, పార్టీలను కలుపుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఈవీఎం నమూనాలను చేతబూని ఓటర్లకు ఈవీఎంపై ఎలా ఓటు వేయాలనే అవగాహన కల్పిస్తూ కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా యనియన్ నాయకులు వి.కృష్ణంరాజు మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంతోపాటు సింగరేణి గనులు, కార్మికుల సమస్యలపై ఎంతో అవగాహన ఉన్న ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలని కార్మిక కుటుంబాల సభ్యులను కోరారు. గనులను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నిస్తోన్న బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే బలరాం నాయక్‌ను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, మిత్రపక్ష యూనియన్, పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిఘాను పెంచండి



అధికారులతో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకుడు

చర్ల, మే 10: పోలింగ్‌కు సమయం దగ్గర పడుతోందని, వచ్చే 72 గంటలు నిఘాను పటిష్ఠం చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్ గోపాల్ సూచించారు. శుక్రవారం చర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ అంతరాష్ట్ర చెక్‌పోస్టుని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ దగ్గర పడుతుండడంతో ఓటర్లను రాజకీయ నాయకులు ప్రలోభాలకు గురిచేసే, నగదు, వస్తువులు పంచే అవకాశం ఉందన్నారు, నిఘాను పెంచి ఓటర్లు ప్రలోభాలను గురికాకుండా అడ్డుకోవాలని సూచించారు. అభ్యర్థులు చేసే ఖర్చులపై దృష్టి పెట్టాలన్నారు. మద్యం రవాణా అడ్డుకోవాలన్నారు. తనిఖీలు ఎప్పటికప్పుడు చెయ్యాలని సూచించారు. ఈ మూడు రోజుల పాటు సర్వే బృందాలు పకడ్బందీగా పని చెయ్యాలని సూచించారు. విధుల్లో అలసత్వం చేస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈయన వెంట భద్రాచలం ఏఎస్పీ పరితోస్ పంకజ్, సీఐ రాజువర్మ, ఏఈవో వేల్పుల శ్రీనివాస్, లైజనింగ్ అధికారి పృధ్వీరాజ్, ఫ్లయింగ్ స్కాడ్ నాగేశ్వరావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోరిక గెలుపునకు టీడీపీ విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

భద్రాచలం, మే 10: మహబూబాద్ లోక్‌సభ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోరుతూ శుక్రవారం భద్రాచలంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో వివిధ కాలనీల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, టీడీపీ నాయకులు అజీమ్, శ్రీనివాస్, సురేష్‌కుమార్, రాజారాం, చిట్టిబాబు, శ్రీనివాసరావు, మాధవరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా

అశ్వారావుపేట, మే 10: ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మండలంలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. తిరుమలకుంట పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ సున్నం సరస్వతి, మాజీ సర్పంచ్ సున్నం రామలక్ష్మయ్య, ఉప సర్పంచ్ జుజ్జూరు రాంబాబు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు బొల్లుకొండ చెన్నారావు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడికి, మండల పార్టీకి రాజీనామా లేఖలను పంపినట్టు వారు తెలిపారు. బీఆర్ఎస్ మండల పార్టీ నాయకుల వైఖరికి నిరసనగ బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.

బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రచారం

భద్రాచలం, మే 10: లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాద్ లోక్‌సభ అభ్యర్థి మాలోతు కవితను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ ప్రజలంతా గులాబీ జెండాకు పట్టం కట్టాలని కోరారు. నియోజవకర్గంలో కవిత గెలుపు ద్వారానే అభివృద్ధి చెందుతుందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం పోయిందని అన్నారు. హామీలే తప్ప అమలు లేదన్నారు. ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకుఇ వచ్చిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్, పడిసిరి శ్రీనివాస్, కాపుల సూరిబాబు, పట్టాభి, నర్సింహులు, సీతామహాలక్ష్మి, రమాదేవి, శివ, అప్పారావు, దానియేలు, ప్రదీప్, నర్సమ్మ, పూజల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ కాంగ్రెస్ అండ: నాగ సీతారాములు



కూలీలతో మాట్లాడుతున్న నాగసీతారాములు

సుజాతనగర్, మే 10: అందరికీ అండ కాంగ్రెస్ జెండా అని పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్ నాగా సీతారాములు అన్నారు. శుక్రవారం మండలంలోని సింగభూపాలెం గ్రామంలో చెరువు వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ఉపాధి కూలీలను కోరారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులను, నిరుపేదల సంక్షేమాన్ని మరిచి, రాష్ట్ర సంపదనంతా తన కుటుంబానికి వాడుకున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏ విధంగానైతే ఓటుతో బుద్ధి చెప్పారో, అదే తరహాలో నిత్యావసర సరుకుల ధరలు పెంచి, మత రాజకీయాలు చేస్తున్న బీజేపీ పార్టీకి కూడా ఎంపీ ఎన్నికల్లో తమ ఓటుతో బుద్ధి చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

ప్రశాతం ఎన్నికలకు సహకరించండి: డీఎస్పీ

అన్నపురెడ్డిపల్లి, మే 10: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహ్మాన్ కోరారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రగుంటలో ఆయన గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా ప్రశాతం వాతావరణంలో పోలింగ్ జరిగేలా రాజకీయ పార్టీలు కూడ సహకరించాలని కోరారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇందుకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.